
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 15 । జనవరి । 2024



'పట్టు'కు పూర్వ వైభవం
వైఎస్సార్ సీపీ సర్కార్ అందజేస్తున్న ప్రోత్సాహకాలతో హిందూపురం పట్టణంలోని పట్టు మార్కెట్ పూర్వ వైభవాన్ని సంతరించుకుంది.

IIలో



కిలో టమాట రూ.15
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాటా గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.7°/ 14.5°
జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత బాగా పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పర్యాటకుల సందడి



వేలాడే స్తంభం వద్ద విదేశీయులు

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి ఆలయంలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సంక్రాంతి పండుగ సెలువులు కావడంతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశీయులు ఆలయానికి విచ్చేశారు. నంది విగ్రహం, థీంపార్కు, జటాయువు ఘాట్, జటాయువు పక్షి తదితర ప్రాంతాలు సందర్శించారు. ఆలయంలో వీరభద్రస్వామి, దుర్గాదేవికి జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ చరిత్ర, విశిష్టతను తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం



పట్టుబడిన మద్యం చూపుతున్న సెబ్ పోలీసులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) దాడులు విస్తృతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం పట్టపర్తి, ధర్మవరం, సీకేపల్లి, తనకల్లు, పెనుకొండ సెబ్ స్టేషన్ల పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. 187 కర్ణాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

వైభవంగా నాగలమడక ఉత్సవాలకు అంకురార్పణ



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు బదరీనాథ్

పావగడ: తాలూకాలోని నాగలమడక అంత్య సుబ్రహ్మణ్య స్వామి బ్రహోత్సవాలకు ఆదివారం వైభవంగా అంకురార్పణ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు బదరీనాథ్ విశేష పూజలు నిర్వహించారు. పూజల్లో ఆలయ నిర్మాణకర్త రొద్దం సుబ్బయ్య శెట్టి వంశీకులు రొద్దం సురేంద్ర బాబు, నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు. దైవదర్శనానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. ఆలయం ఎదుట ఉన్న నాగులకట్టపై భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఉత్సవాల తొలిరోజే పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

ఎన్పీకుంట: మండలంలోని పెడబల్లి పరిసర ప్రాంతాల్లో ఆదివారం కోడి పందెం ఆడుతున్న 11 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎన్.వెంకటరమణ తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారంతో అప్రమత్తమైన ఎస్ఐ వెంకటరమణ... సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో 11 మంది జూదరులు పట్టుబడ్డారు. నిందితుల నుంచి రూ.8,100 నగదుతో పాటు రెండు కోడి పుంజులు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

భోగి వైభోగమే..



పుట్టపర్తి శిల్పారామం వద్ద భోగి మంటలు

పుట్టపర్తి టౌన్: ఆకుపచ్చని మామిడి తోరణాలు, పసుపు పచ్చని మేలిమి సింగారంతో మెరిసే గడపలు.. ముంగిట్లో ముగ్గులు, అందమైన గొబ్బెమ్మలు.. ఇంటికి తరలివచ్చిన ధాన్యరాశులతో సంక్రాంతి పండుగ తెలుగింటి సంస్కృతిని ప్రతిబింబించింది. మూడురోజుల వేడుకలో తొలిరోజు ఆదివారం భోగ భాగ్యాలనిచ్చే భోగి పండుగ జిల్లా అంతటా ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా తెల్లవారుజామునే అందరూ లేచి ఇళ్ల ముందు సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వేశారు. పాత చీపుర్లు, తట్టలు, విరిగిపోయిన బల్లలు తదితర పాత వస్తువులను మంటల్లో వేసి శరీరాన్ని వెచ్చబరచుకున్నారు. చెడు కర్మలు తొలగించి పుణ్యగతులు సిద్ధింపచేయాలని అగ్నిదేవుని సాక్షిగా వేడుకున్నారు. ముత్తయిదువులు చిన్నారులపై భోగి పండ్లు (రేగి పండ్లు, బంతిపూలు, చామంతి, గులాబీ, రుపాయి నాణేలు) పోసి ఆశీర్వదించారు. పాల పొంగులు పొంగిస్తూ తీపి పదార్థాలతో సంతోషాలు పంచుకున్నారు. సోమవారం సరదాల సంక్రాంతి, మంగళవారం కమ్మని విందుతో కనుమను ఆస్వాదించనున్నారు. ఆటల పోటీలతో సంతోషంగా గడపనున్నారు.



అమరాపురంలో భోగి మంటల వద్ద కోలాహలం

నేడు మకర పూజలు
మకర సంక్రాంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. నెల రోజులుగా సాగిన తిరుప్పావై, ధనుర్మాస పూజల ముగింపు ఉత్సవాలు వేడుకగా సాగనున్నాయి. ముఖ్యంగా అయ్యప్ప మకర జ్యోతి సందర్భంగా హరిహరసుతుని దేవాలయాల్లో ప్రత్యేక పూజలందుకోవడానికి అయ్యప్పను శోభాయమానంగా అలంకరిస్తున్నారు.



బత్తలపల్లిలో రంగవల్లిని తీర్చిదిద్దుతున్న యువతి

నాసిన్ కీర్తి.. సీమకే ఖ్యాతి

- టీడీపీ హయాంలో శంకుస్థాపనలకే పరిమితం
- సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో పనులు పరుగులు
- రూ. 749 కోట్ల విడుదల
- ఈ నెల 16న అకాడమీని సందర్శించనున్న ప్రధాని



అకాడమీ ఆవరణలో విమానం



పాలసముద్రం సమీపంలోని నాసిన్ అకాడమీ

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం వద్ద ఏర్పాటవుతున్న నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్) ఉమ్మడి అనంతపురం జిల్లాకే కాకుండా రాయలసీమకే తలమానికంగా కీర్తి పొందుతోంది. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించి, నిధులు రాబట్టడంలో సఫలం కావడంతో కేంద్ర పనులు శరవేగంగా సాగాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పలు కేంద్రాలను ఆయన పరిశీలించనున్నారు.

ప్రచార ఆర్భాటానికే పరిమితమైన బాబు..
2014 రాష్ట్ర పునర్విభజన చట్టంలో కరువు జిల్లా అయిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థను నెలకొల్పనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.పాలసముద్రం సమీపంలో 502 ఎకరాల్లో నాసిన్ సంస్థ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2014లో ఒకసారి, 2015 ఏప్రిల్ 15న మరోసారి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మంత్రులతో శంకుస్థాపనలు చేశారు. ఆ తర్వాత మిన్నకుండి పోయారు. 2015 నుంచి 2019 వరకు నాసిన్ సంస్థ కోసం సేకరించిన భూమిలో ఎలాంటి నిర్మాణాలు జరిగింది లేదు.

పనులు పరుగులు పెట్టించిన సీఎం జగన్
వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విభజన హామీలు సత్వరం అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలోనే 2022 మార్చి 5న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాల సీతారామన్ పాలసముద్రం సమీపంలో నాసిన్ సంస్థ ఏర్పాటుకు సేకరించిన భూముల్లో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. రూ. 749 కోట్లు నిధులు విడుదల చేస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. పనులు ప్రాంభమైనప్పటి నుంచి రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నాసిన్ పనుల పురోగతిపై అధికారులతో అనేక సార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీంతో పనులు పరుగులు పెట్టాయి. ఈ క్రమంలోనే ఈ నెల 16న భారత ప్రధాని నరేంద్రమోదీ నాసిన్‌ను సందర్శిస్తున్నారు. 74,75 వ బ్యాచ్‌ల ఆఫీసర్ ట్రైనీలతో ముఖాముఖిలో పాల్గొంటారు.

పాలసముద్రానికి ప్రత్యేక గుర్తింపు...
నాసిన్ సంస్థ ఏర్పాటుతో పాలసముద్రం గ్రామం దేశంలోనే కాకుండా ప్రపంచ పటంలోనే ప్రత్యేక గుర్తింపు సంతరించుకోనుంది. ముస్సోరీ, హైదరాబాద్‌లో ఐఏఎస్, ఐపీఎస్‌లకు శిక్షణ ఇచ్చినట్లుగానే, పాలసముద్రం నాసిన్‌లో ఐఆర్ఎస్ పోస్టులకు ఎంపికైన వారికి శిక్షణ ఇస్తారు. అలాగే, దక్షిణాసియా దేశాలకు చెందిన ఐఆర్ఎస్ అధికారులు కూడా ఇక్కడ శిక్షణ పొందనున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన జేసీ
ప్రధాని నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో ఆదివారం నాసిన్‌ను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సందర్శించారు. ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

లేపాక్షి వీరభద్ర స్వామిని దర్శించుకోనున్న ప్రధాని



లేపాక్షిలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

లేపాక్షి: ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 16న లేపాక్షి ఆలయాన్ని సందర్శించనున్నారు. ప్రధానితో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కూడా రానున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆదివారం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ లేపాక్షిలో పర్యటించారు. నంది విగ్రహం సమీపంలో 3 హెలిప్యాడ్‌ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. వీరభద్ర స్వామి ఆలయాన్ని పరిశీలించి, చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఏపీ టూరిజం కార్యాలయంలో అధికారులతో సమావేశమై, దిశా నిర్దేశం చేశారు.

వైభవంగా గోదాదేవీ పరిణయోత్సవం



వేంకటేశ్వరస్వామి, గోదాదేవి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: ధనుర్మాస ముగింపును పురస్కరించుకుని ఆదివారం వేంకటేశ్వరస్వామి-గోదాదేవిల పరిణయోత్సవం వైభవంగా జరిగింది. తాడిపత్రిలోని చింతల వేంకటరమణస్వామి ఆలయంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భోగి పండుగ రోజున శ్రీవారి వక్షస్థల లక్ష్మిని గోదాదేవిగా భావించి ఆలయంలో ఏకాంతంగా పరిణయోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య రాత్రి 7 గంటలకు వేద పండితుల సమక్షంలో పరిణయోత్సవం నిర్వహించారు. భక్తులు వివిధ రకాల పండ్లు, కానుకలు, ప్రత్యేకంగా తయారు చేసిన పిండి వంటలను స్వామివార్లకు సమర్పించారు. రాత్రి 9గంటలకు ఆలయ ప్రాకారోత్సవం జరిగింది. పల్లకీలో ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

రైళ్లలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ధర్మవరం అర్బన్: ధర్మవరం రైల్వే జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించే రైళ్లలో జీఆర్పీ పోలీసులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రతి రైలునూ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు జీఆర్పీ సీఐ నాగరాజు తెలిపారు. ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా విస్తృత తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. అనుమానిత ప్రయాణికులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో దొంగలు చెలరేగకుండా ఈ తనిఖీలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నాని చెప్పారు. తనిఖీల్లో జీఆర్పీ ఎస్ఐ గోపీకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



బోగీలో తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు

నేడు 'పోలీసు స్పందన' రద్దు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేశారు. ఈ మేరకు ఎస్పీ మాధవరెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు వివరించారు. ఈ విషయాన్ని గుర్తించి, అర్జీలు ఇచ్చేందుకు ఎవరూ కార్యాలయానికి రావద్దంటూ విజ్ఞప్తి చేశారు.

సంక్రాంతి శుభాకాంక్షలు
జిల్లా ప్రజలకు ఎస్పీ మాధవరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయ అనుబంధాలకు, తెలుగు సంప్రదాయాలకు ప్రతీకగా ఉన్న పర్వదినాన్ని ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే పుట్టపర్తి సమీపంలోని ఎస్పీ కార్యాలయంలో భోగి పండుగను పురస్కరించుకుని పోలీసు కుటుంబసభ్యులు భోగి మంటలు వేసి సందడి చేశారు.



భక్త కనకదాస నాటికలో ఓ ఘట్టం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కనకదాస భక్తి.. వింటే కలగదా ముక్తి!

ప్రశాంతి నిలయం: సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా ఆదివారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత బృందావన్ క్యాంపస్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కనకదాస భక్తి ప్రపత్తులను వివరిస్తూ భక్తరస నాటిక నిర్వహించారు. చక్కటి నృత్య భంగిమలతో గీతాలు ఆలపిస్తూ సాగిన నాటిక భక్తులను మైమరపించింది. ఉదయం వేడుకల్లో భాగంగా సాయి సంగీత్ ఉత్తరాయణం పేరుతో ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. చక్కటి భక్తి గీతాలు ఆలపిస్తూ సాయికుల్వంత్ సభా మందిరాన్ని మార్మోగించారు.

నెట్టికంటుడి సన్నిధిలో ఘనంగా హోమం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో పుష్యమాసం సందర్భంగా ఆదివారం హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ యాగశాలలో హోమం కొనసాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

పుట్టపర్తి రూరల్: స్థానిక శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు ఆదివారం వేడుకగా జరిగాయి. ఆదివారం భోగిమంటలు వేశారు. రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి సందడి చేశారు. సోమవారం ఉదయం 10 నుంచి 1 గంట వరకూ ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. కనుమను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకూ బుల్లి తెర నటుడు సునామీ సుధాకర్ కామిడీ షో, మదనపల్లికి చెందిన కళాతరంగిణి గ్రూపు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, హోరెత్తించే డీజే పాటల సందడి ఉంటుందని శిల్పారామం ఏఓ రమేష్‌రెడ్డి తెలిపారు. తొలిరోజు కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు కవిత, నారపరెడ్డి, శిల్పారామం సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో వ్యక్తి మృతదేహం

నల్లమాడ: మండలంలోని గూడమేకలపల్లి వద్ద దొన్నికోట–పులగంపల్లి రహదారి పక్కనే ఉన్న పిల్లిగుండ్లబావిలో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతదేహం తేలింది. అటుగా వెళ్లిన స్థానికులు విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడికి 35 ఏళ్ల వయస్సు ఉంటుంది. చేతులు, కాళ్లు తాళ్లతో కట్టేసి ఉన్నాయి. మృతదేహం ఉబ్బిపోయి కుళ్లిన స్థితిలో ఉండడంతో మూడు రోజుల క్రితం బావిలో పడేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

రాజంపేట రూరల్: సంక్రాంతి వేడుకల్లో భాగంగా రాజంపేట ఆకేపాటి ఎస్టేట్‌లో దివంగత ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మ జ్ఞాపకార్థం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. మైదుకూరు టౌన్‌కు చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్ వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం గోసులవారిపల్లికి చెందిన పామిరెడ్డి వెంకటరమణారెడ్డి వృషభాలు ద్వితీయ స్థానం, మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూలే ప్రసాద్‌రెడ్డి వృషభాలు తృతీయ స్థానం, మూలే సూరారెడ్డి వృషభాలు నాలుగో స్థానం, కమలాపురం మండలం జంగంపల్లికి చెందిన పుత్తా నాగసుబ్బారెడ్డి వృషభాలు ఐదో స్థానం, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లికి చెందిన తోట తిరుపాల్‌రెడ్డి వృషభాలు ఆరో స్థానం దక్కించుకున్నాయి. యజమానులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

పట్టుకు పూర్వ వైభవం

- జగన్ సర్కార్ ప్రోత్సాహకాలతో మహర్దశ
- తక్కువ శ్రమతో అధిక లాభాలు గడిస్తున్న రైతులు
- ప్రతినెలా నికర ఆదాయంతో ఆర్థిక ఇబ్బందులు దూరం
- విడతల వారీగా రైతులు, రీలర్ల బ్యాంక్ ఖాతాల్లోకి ప్రోత్సాహకాన్ని జమ చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం


హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్

హిందూపురం అర్బన్: జగన్ సర్కార్ అందజేస్తున్న ప్రోత్సాహకాలతో హిందూపురంలోని పట్టు మార్కెట్ పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. డిమాండ్‌తో పాటు పెరిగిన ఉత్పత్తితో మార్కెట్ కళకళ లాడుతోంది. 'ఈ–మార్కెట్' విధానం అమలుతో దళారుల ప్రమేయానికి అడ్డుకట్టపడింది. ప్రతి నెలా నికర ఆదాయంతో రైతులతో పాటు రీలర్లు ఆర్థికంగా బలపడుతున్నారు.

రాష్ట్రంలోనే 'పురం' మార్కెట్ ప్రత్యేకత

రాష్ట్రంలోనే హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్ ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడకు అత్యధికంగా పట్టుగూళ్లను విక్రయానికి రైతులు తీసుకువస్తుంటారు. ఏడాదికి రెండు వేల టన్నులకు పైగా పట్టు గూళ్ల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన పట్టు రైతులతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు చెందిన దాదాపు 80 శాతం మంది రైతులు ఇక్కడికే పట్టుగూళ్లను తీసుకువచ్చి విక్రయిస్తుండడం గమనార్హం. రాష్ట్రంలోని బైవోల్టిన్ పట్టు రైతులకు కిలోకు రూ.50, రీలర్లకు సిల్క్‌పై రూ.130, చరఖా సిల్క్‌కు రూ.30 చొప్పున విడతల వారీగా జగన్ ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందజేస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 12న తొలి విడత ప్రోత్సాహకాన్ని రైతులు, రీలర్ల బ్యాంక్ ఖాతాల్లోకి సీఎం వైఎస్ జగన్ జమ చేశారు.

పట్టించుకోని గత ప్రభుత్వం

వరుస కరువులతో విలవిల్లాడిన జిల్లా రైతులను ఆదుకోవడంలో గత చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 2014 నుంచి 2019 వరకు పట్టు పరిశ్రమ పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయింది. దీనికి తోడు దళారుల ప్రమేయంతో హిందూపురం మార్కెట్ పూర్తిగా నాశనమైంది. ప్రోత్సాహకాలను అందజేయకుండా అప్పటి సీఎం చంద్రబాబు మోసం చేయడంతో పలు దఫాలు పట్టు రైతులు, రీలర్లు ఆందోళనలు చేపట్టారు. అయినా టీడీపీ ప్రభుత్వంలో మార్పు రాలేదు. ఇలాంటి పరిస్థితిలో 2019 ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితుల్లో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. క్రమం తప్పకుండా పట్టు రైతులకు, రీలర్లను ప్రోత్సహిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహకాలను అందజేస్తూ వస్తున్నారు. దీంతో జిల్లాలో పట్టు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో హిందూపురంలోని పట్టుగూళ్ల విక్రయ కేంద్రం మరోసారి పట్టు రైతులతో కళకళ లాడుతుంది.

రైతుల ఖాతాల్లోకి నగదు జమ

హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌కు సంబంధించి పట్టురైతులకు రూ.14కోట్లు, రీలర్లకు రూ.3.5కోట్ల ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందజేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోనే అతి పెద్ద మార్కెట్ కావడంతో మొత్తం ఉత్పత్తిలో 80 శాతానికి పైగా పట్టుగూళ్లను రైతులు ఇక్కడికే తీసుకు వస్తుంటారు. క్రయవిక్రయాలకు సంబంధించి రికార్డులు పక్కాగా నిర్వహిస్తున్నాం. దీని ఆధారంగా రైతులకు, రీలర్ల బ్యాంక్ ఖాతాల్లోకి ప్రోత్సాహకాన్ని విడతల వారీగా ప్రభుత్వం జమ చేస్తోంది. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతూ ఉంటుంది.

– లక్ష్మీరెడ్డి, మార్కెటింగ్ శాఖ ఇన్‌స్పెక్టర్, హిందూపురం

పరేడ్‌కు యోగా శిక్షకురాలు


కృష్ణవేణి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రెండో రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకురాలుగా పని చేస్తున్న కె.కృష్ణవేణికి అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 26న న్యూఢిల్లీ వేదికగా జరిగే గణతంత్ర వేడుకల్లో జరిగే పరేడ్‌కు ఆమె ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయుష్ విభాగం తరఫున పరేడ్‌లో యోగాసనాలను ఆమె ప్రదర్శించనున్నారు. రాయలసీమలోని ఎనిమిది జిల్లాల్లో ఉన్న హెల్త్, వెల్‌నెస్ సెంటర్లలో విశేష సేవలు అందించినందుకు ఆమెకు అరుదైన ఈ అవకాశం దక్కింది. ఈ సందర్భంగా పలువురు యోగా భ్యాసకులు ఆమెను అభినందించారు.

బలవంతంగా టీడీపీ కండువాలు వేసారు


మాట్లాడుతున్న బాలేపల్లి తండా యువకులు

నల్లచెరువు: మండలంలోని బాలేపల్లి తండాకు చెందిన టీడీపీ నేత గంగరాజు నాయక్ ఆధ్వర్యంలో తాము టీడీపీలో చేరుతున్నట్లుగా ప్రకటించి ఆ పార్టీ ఇన్‌చార్జ్ కందికుంట ప్రసాద్ బలవంతంగా కండువాలు వేసారని గ్రామానికి యువకులు నవీన్‌కుమార్ నాయక్, ప్రవీణ్ కుమార్ నాయక్, బాలాజీ నాయక్ వాపోయారు. భోగి పండుగ సందర్భంగా ఆదివారం కదిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వెళ్లిన తమను అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గంగరాజు పిలుచుకెళ్లి కందికుంట వెంకటప్రసాద్‌తో బలవంతంగా కండువాలు వేయించారని వివరించారు. అనంతరం ఇదే విషయాన్ని పక్కదారి పట్టిస్తూ గ్రామానికి చెందిన 30 మంది యువకులు తమ పార్టీలోకి వచ్చారని తప్పుడు ప్రచారం చేసుకుంటుండడం సిగ్గు చేటన్నారు. తాము, తమ కుటుంబాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పథకాలతో లబ్ధి పొందామని, తామెన్నడూ జగనన్న వెంటే నడుస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు హైటెక్ రమణ మాట్లాడుతూ... టీడీపీ నాయకులు ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయడం సరికాదన్నారు.

రమేష్ నారాయణ సాహిత్య సేవలు స్ఫూర్తిదాయకం

అనంతపురం కల్చరల్: అనంత సాహిత్యానికి డాక్టర్ పతికి రమేష్ నారాయణ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని వక్తలు అన్నారు. ఇటీవల రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న డాక్టర్ రమేష్ నారాయణను సాహిత్య భారతి, డాక్టర్ ఉమర్ అలీషా సాహితీ సమితి ప్రతినిధులు, ద్విభాషా కవి జూటూరు షరీఫ్, పండిట్ రియాజుద్దీన్, తోట నాగరాజు, నరసింహులు తదితరులు ఆయన్ను సత్కరించారు. జిల్లా సాహిత్యంలో 60కి పైగా పుస్తకాలు రాసిన పతికి రమేష్ నారాయణను ప్రభుత్వం గుర్తించిందని హర్షం వ్యక్తం చేశారు. ఆయన రచించిన ఎర్రని ఆకాశం, జిల్లా జానపద సాహిత్యంపై రాసిన పరిశోధన గ్రంథాలు ఎంతో అమూల్యమైనవన్నారు.

జిల్లా చిన్న మొత్తాల పొదుపు సంఘం నూతన కమిటీ ఎంపిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న చిన్న మొత్తాల పొదుపు సంఘం కార్యవర్గ సభ్యులు

ధర్మవరం అర్బన్: జిల్లా చిన్న మొత్తాల పొదుపు సంఘం నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. ధర్మవరంలోని కొత్తపేటలో ఉన్న మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉమ్మడి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా చలపతి, ఉపాధ్యక్షులుగా ఫణిరాజ్, వెంకటేష్ శెట్టి, నాగభూషణం, ప్రభాకర్‌గుప్తతోపాటు 15 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలో చిన్న మొత్తాల పొదుపు సంఘం అభివృద్ధికి తాము కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణోత్సవం


ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


కొత్తపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: మండల కేంద్రంలోని బ్రాహ్మణ వీధిలో కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. స్వామి వారికి శుద్ధ జలం, పంచామృతాలతో అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భానుప్రకాష్ అభిషేకించి, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి వేదమంత్రోచ్చారణల నడుమ వైభవంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాశెట్టి సుబ్రహ్మణ్యం, దేవదాయ శాఖ ఈఓ వెంకటేసులు, కమిటీ ఉపాధ్యక్షుడు కుండా చౌడయ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో...

పట్టణంలోని కొత్తపేట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


తాడిమర్రిలో గోదాదేవి చరిత్రను పఠిస్తున్న భక్తులు

తాడిమర్రి కన్యకాపరమేశ్వరి ఆలయంలో...

తాడిమర్రి: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో 30 రోజుల పాటు గోదాదేవి చరిత్రను ఆర్య వైశ్యులు పఠించారు. చివరి రోజున గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించి వేడకను ముగించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వలస కూలీ దుర్మరణం

గోరంట్ల: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వలస కూలీ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బిహార్‌కు చెందిన మోహన్ మిశ్రా(35) కొన్ని రోజుల క్రితం గోరంట్లకు వలస వచ్చి స్థానిక గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో కూలీగా జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి పొద్దుపోయాక పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై పులేరు నుంచి గోరంట్లకు వస్తుండగా మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన మోహన్‌మిశ్రా అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన వాహన దారులు రోడ్డుపై పడి ఉన్న మిశ్రా మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మృతదేహంతో నిరసన

అమడగూరు: మండలంలోని దాదెంవారిపల్లి తండాకు చెందిన వెంకటరమణ నాయక్ (40) హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆదివారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు కర్ణాటక పోలీసులు అప్పగించారు. హతుడి మృతదేహాన్ని తీసుకెళ్లి హత్యకు కారకుడిగా అనుమానిస్తున్న లోకోజుపల్లికి చెందిన ప్రైవేట్ వైద్యుడు బాబు ఇంటి ఎదుట పాతిపెట్టేందుకు కుటుంబసభ్యులు సిద్ధమయ్యారు. ఆ సమయంలో ఉద్రిక్తత నెలకొంది. మృతదేహంతో కుటుంబసభ్యులు నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు, పలువురు గ్రామపెద్దలు సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది. కాగా, వైద్యుడు బాబును పాతపాళ్యం స్టేషన్‌లో విచారిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

రూ.2.35 కోట్ల విలువైన సిగరెట్ల పట్టివేత

అనంతపురం సిటీ: ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న రూ.2.35 కోట్ల విలువైన సిగరెట్లను జీఎస్టీ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సెంట్రల్ జీఎస్టీ అనంతపురం డివిజన్ సహాయ కమిషనర్ జి.అనిత వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకూ హైదరాబాద్–బెంగళూరు మార్గంలోని 44వ జాతీయ రహదారిపై అనంతపురం తపోవనం సర్కిల్ వద్ద జీఎస్టీ సూపరింటెండెంట్లు రంగనాయకులు, నాగానంద, రాహుల్, ఇన్‌స్పెక్టర్ జయకృష్ణ, హెడ్ హవాల్దార్ ప్రభుదాస్, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఆదివారం వేకువజామున అటుగా వచ్చిన ఆర్‌జే11 జీబీ 9560 నంబర్ గల లారీని ఆపి పరిశీలించడంతో అందులో భారీ సంఖ్యలో సిగరెట్ల బండిళ్లు బయటపడ్డాయి. వీటికి సంబంధించి ఎలాంటి రికార్డులు, బిల్లులు లేవు. గోల్డ్ ఫ్లేక్ ఫిల్టర్, ప్యారిస్ వంటి బ్రాండ్లకు చెందిన సిగరెట్లుగా గుర్తించారు. వీటి విలువ దాదాపు రూ.2.35 కోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. విచారణలో పాట్నా నుంచి బెంగళూరుకు తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ తెలిపాడు. వాహనాన్ని సీజ్ చేసి, సిగరెట్ల బండిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై లోతైన విచారణ చేపట్టినట్లు జీఎస్టీ ఏసీ అనిత తెలిపారు.

తాగుడుకు డబ్బు ఇవ్వలేదని తల్లిపై కొడవలితో దాడి


గాయపడిన బాల వీరమ్మ

తాడిమర్రి: మద్యం కొనుగోలుకు డబ్బు ఇవ్వలేదన్న కోపంతో కన్న తల్లిపై కొడవలితో కుమారుడు దాడి చేసిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం మద్దిమాకులపల్లికి చెందిన సాకే బాల వీరమ్మ (55) భర్త ఆదినారాయణ కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఇద్దరు కుమారులను పెంచి పెద్దచేసి పెళ్లిళ్లూ చేసింది. ఇద్దరు కుమారులు వేరు కాపురాలు ఉంటున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన చిన్న కుమారుడు ఈశ్వరయ్య ఆదివారం సాయంత్రం తల్లిని కలిసి మద్యం తాగడానికి డబ్బులు కావాలని అడిగాడు. దీంతో తన వద్ద డబ్బు లేదని ఆమె చెప్పడంతో ఆగ్రహంతో వెనుదిరిగిన ఈశ్వరయ్య రాత్రి 9.30 గంటల సమయంలో పూటుగా మద్యం సేవించి ఇంట్లో నిద్రిస్తున్న తల్లిపై కొడవలితో దాడి చేశాడు. చేతిపై, మెడపై గాయాలయ్యాయి. దాడి సమయంలో వీరమ్మ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడ పోగవుతుండడం గమనించిన ఈశ్వరయ్య అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన వీరమ్మను కుటుంబసభ్యులు వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగస్వామి, సిబ్బంది గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి, ఈశ్వరయ్య కోసం గాలింపు చేపట్టారు.

సీపీఐ (ఎంఎల్) నేత పెద్దన్న మృతి

అనంతపురం అర్బన్: సీపీఐ (ఎంఎల్) అనంతపురం జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, ప్రగతిశీల మహిళ సంఘం రాష్ట్ర నాయకురాలు మల్లీశ్వరి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.